
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5 తమిళనాడు TAMILNADU
శుక్రవారం 6 జూన్ 2025



చక్కెర వ్యాధి నివారించే దివ్య క్షేత్రం... వెన్నికరుంబేశ్వరాలయం

- 7లో -



సినిమా అవార్డులను ప్రదానం చేయండి

యాక్టివ్ ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ విజ్ఞప్తి

- 7లో -

మదురై సమీపంలో బయల్పడిన ప్రాచీన శివాలయం

- 6లో -



ధనుష్కోడి తీరంలో పెనుగాలులు

- అరిచ్చల్‌మునై మార్గంలో ఇసుకమేటలు

చెన్నై, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం సమీపం ధనుష్కోడి తీరంలో గత రెండు రోజులుగా వీస్తున్న పెనుగాలులకు అరిచ్చలైమునై మూడు వైపులా రాక్షస అలలు ఎగసిపడ్డాయి. దీంతో అరిచ్చల్‌మునై జాతీయ రహదారిని ఇసుకమేటలు పూర్తిగా కప్పేశాయి. దీంతో గురువారం ఉదయం ఆ ప్రాంతాన్ని సందర్శించేందుకు వెళ్ళిన పర్యాటకులు తీవ్ర నిరాశ చెందారు. ప్రస్తుతం ధనుష్కోడి, ముకుందరాయర్ సత్రం, అరిచ్చల్‌మునై ప్రాంతాల్లో తీరంలో ఉన్న ఇసుక రోడ్డుమీదకు చేరింది. రామేశ్వరం నుండి ధనుష్కోడి వెళ్లే మార్గంలోనూ రహదారిపై ఇసుక మేటలు పరచుకున్నాయి. దీంతో ఆ మార్గంలో వాహనచోదకులు ఇబ్బందులకు గురయ్యారు. ధనుష్కోడి తీరంలో రాక్షస అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతుండడంతో పర్యాటకులు అరిచ్చల్ మునై చివరి ప్రాంతానికి ఎవరూ వెళ్ళకూడదంటూ పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. ముకుందరాయర్ సత్రం, ధనుష్కోడి, అరిచ్చల్ మునై సముద్రతీరంలోకి ఎవరూ దిగకూడదని, స్నానాలు చేయొద్దని పోలీసులు మైకుల్లో హెచ్చరికలు చేశారు. ధనుష్కోడిలో సాయంత్రం ఐదు తర్వాత పర్యాటకులెవరూ సంచరించకూడదని కూడా తెలిపారు.



అరిచ్చల్‌మునై జాతీయ రహదారిపై పరచుకున్న ఇసుకమేటలు

ఏడు రోజులు వర్షసూచన

పెరంబూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఒకటి, రెండు ప్రాంతాలు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో వచ్చే ఏడు రోజులు ఉరుములు, ఈదురుగాలులతో మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. ఈ మేరకు ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో... పశ్చిమ గాలుల వేగంలో మార్పుల కారణంగా రాష్ట్రంలోని ఒకటి, రెండు ప్రాంతాల్లో భారీవర్షాలు, మిగిలిన ప్రాంతంలో మోస్తరు వర్షం కురిసే అవకాశముందని తెలిపింది. రాజధాని నగరం చెన్నైలో ఆకాశమ మేఘావృతంగా ఉంటూ కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

రాందాస్‌తో అన్బుమణి భేటీ

- సయోధ్యకు యత్నాలు
- రంగంలోకి ఆడిటర్ గురుమూర్తి

చెన్నై, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): వన్నియార్ల ఓటు బ్యాంకు కలిగిన పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే)లో గత కొద్ది నెలలుగా ఆ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్, ఆయన తనయుడు పార్టీ అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి మధ్య కొనసాగుతున్న ఆధిపత్యపోరు గురువారం సమసి పోతుందనుకున్న పార్టీ శ్రేణులకు తీవ్ర నిరాశే మిగిలింది. ముప్పావు గంటసేపు కొనసాగిన భేటీ సత్ఫలితాలివ్వలేదని తెలుస్తోంది. అదే సమయంలో తండ్రీ తనయుల మధ్య రాజీ కుదిర్చేందుకు ప్రముఖ ఆడిటర్ గురుమూర్తి రంగ ప్రవేశం చేశారు. ఇటీవల పార్టీ అధ్యక్షుడిగా తన మాటకు తిరుగులేదంటూ మూడు రోజులపాటు చోళింగనల్లూరులో జిల్లా నేతలతో జరిగిన సమావేశాల్లో అన్బుమణి చేసిన ప్రకటన రాందాస్‌కు తీవ్ర ఆగ్రహం కలిగించింది. అన్బుమణి మద్దతుదారులను పార్టీ తొలగించి, తన అనుయాయులను నియమించారు. రెండు రోజుల క్రితం రాందాస్ మీడియాతో మాట్లాడుతూ పార్టీలో నెలకొన్న సంక్షోభంపై గురువారం తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని తెలిపారు. ఆయన మాటలను బట్టి అన్బుమణిని పార్టీ నుండి తొలగించడం ఖాయమని అందరూ అనుకున్నారు. ఆ నేపథ్యంలో గత కొద్ది రోజులుగా చెన్నైలోనే ఉంటున్న అన్బుమణి గురువారం ఉదయం దిండివనం తైలాపురం గార్డెన్‌కు వెళ్ళి పార్టీ వ్యవస్థాపకుడైన తన తండ్రి రాందాస్‌ను కలుసుకున్నారు. ఈ విషయం తెలియగానే పార్టీ గౌరవాధ్యక్షుడు జీకే మణి సహా పలువురు నాయకులు తండ్రీ తనయుల భేటీ సత్ఫలితమిస్తుందని భావించారు. అన్బుమణి తన కుమార్తెతో కలిసి వెళ్లి రాందాస్‌తో భేటీ అయ్యారు. ఉదయం 9.10 నుంచి 10 గంటల వరకు ఇద్దరూ చర్చలు జరిపారు. ఈ చర్చలలో రాందాస్ పెద్దకుమార్తె కాంతిమతి కూడా పాల్గొన్నారు. ఈ చర్చల తర్వాత అన్బుమణి విసవిసా బయటకు వచ్చి కారెక్కి వెళ్ళిపోయారు. అన్బుమణి మీడియాతో భేటి కావాల్సి ఉన్నప్పటికీ ఎందుకనో వెళ్ళిపోయారు.



రాందాస్‌ను కలుసుకుని వెళ్తున్న ఆడిటర్ గురుమూర్తి



రాందాస్, అన్బుమణి



ఆడిటర్ గురుమూర్తి రంగ ప్రవేశం..

రాందాస్‌ను కలుసుకుని అన్బుమణి వెళ్ళిపోయిన పది నిమిషాల తర్వాత తుగ్లక్ పత్రిక సంపాదకుడు, ఆడిటర్ గురుమూర్తి, చెన్నై నగర మాజీ మేయర్ సైదై దురైసామి తైలాపురం చేరుకున్నారు. ఆ మధ్య కేంద్ర హోం శాఖమంత్రి అమిత్‌షా నగరానికి వచ్చినప్పుడు అన్నాడీఎంకే, బీజేపీ మధ్య పొత్తు ఖరారు ప్రకటన సభ ఏర్పాటు చేయడంలో గురుమూర్తి కీలకపాత్ర పోషించిన విషయం తెలిసిందే. అమిత్‌షా ముందుగా గురుమూర్తి నివాసంలో చర్చలు జరిపిన మీదటే గిండి స్టార్ హోటల్‌లో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామిని పక్కన కూర్చోబెట్టుకుని 2026 అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పోటీ చేయడానికి రెండు పార్టీల మధ్య పొత్తుఖరారైందని ప్రకటించారు. ఆ రీతిలోనే గురుమూర్తి పీఎంకేని ఎన్డీయేలో చేర్చేదిశగా పావులు కదిలించేందుకు తైలాపురం గార్డెన్‌కు వెళ్ళారు. అన్బుమణి వెళ్ళిన 10 నిమిషాలకు ఒకే కారులో గురుమూర్తి, సైదై దురైసామి కలిసి రాందాస్ నివాసానికి చేరుకున్నారు. వీరిద్దరూ మధ్యాహ్నం 1.15 గంటల వరకూ రాందాస్‌తో అసెంబ్లీ ఎన్నికల వ్యూహంపై చర్చించారు. అదే సమయంలో పీఎంకేలో తండ్రీతనయుల మధ్య కొనసాగుతున్న ఆధిపత్య పోరుకు ముగింపు పలకాలని రాందాస్‌కు గురుమూర్తి సూచన చేసినట్లు తెలుస్తోంది. రాందాస్‌తో సమావేశం అనంతరం గురుమూర్తి మీడియాతో మాట్లాడుతూ రాందాస్ తన చిరకాల మిత్రుడని, ఆయనకు తానంటే ఎంతో ఇష్టమని కూడా చెప్పారు. అన్బుమణి వచ్చివెళ్ళినట్లు తనకు తెలియదని చెప్పారు. అదే సమయంలో పీఎంకేతో పొత్తు ఖరారు చేసుకునేందుకు బీజేపీ ప్రతినిధిగా తాను ఎలాంటి చర్చలు చేయలేదని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల మధ్య సమస్యలు, సంక్షోభం వచ్చినప్పుడల్లా హాజరవుతున్నారే అంటూ విలేఖరులు ఆయనను ప్రశ్నించినప్పుడు తాను వెళ్ళే చోట సమస్యలు రావటం ఆనవాయితీగా మారిందని గురుమూర్తి నవ్వుతూ చెప్పారు. తండ్రీకొడుకుల మధ్య సయోధ్య కుదిరిందా అన్న ప్రశ్నకు బదులివ్వకుండా ఆయన బయలుదేరి వెళ్ళారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

- పది కోట్ల మొక్కలు నాటాం
- సీఎం స్టాలిన్

చెన్నై, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పుడమికి ప్రాణవాయువు అందించేవి అడవులేనని, అలాంటి అడవులను కంటికి రెప్పలా కాపాడుతున్న అటవీశాఖ ఉద్యోగులే నిజమైన హీరోలని ముఖ్యమంత్రి స్టాలిన్ కొనియాడారు. డీఎంకే అధికారంలోకి వచ్చినప్పటి నుండి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ఎన్నో పథకాలను అమలుచేసిందని, రాష్ట్రాన్ని హరితవనంగా తీర్చి దిద్దటానికి ఇప్పటికే 10 కోట్ల మొక్కలు నాటే కార్యక్రమాలను భారీ యెత్తున జరిపామని ఆయన తెలిపారు. నందంబాక్కంలోని ట్రేడ్ సెంటర్‌లో గురువారం ఉదయం జరిగిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లలో 7వేల హెక్టార్లలో అభయారణ్యాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అగత్తియమలై ఏనుగుల సంరక్షణ కేంద్రం, దక్షిణ కావేరి వన్యమృగాల సంరక్షణ కేంద్రం, తంథై పెరియార్ వన్యప్రాణుల సంరక్షణ కేంద్రం, కడవూరులో దేశంలోనే మొదటి దేవాంగ పిల్లుల శరణాలయం, నంజురాయన్, కళువేలి పక్షుల శరణాలయాలను సురక్షిత ప్రాంతాలుగా ప్రకటించినట్లు తెలిపారు. 2021లో ప్రారంభించిన మీండుమ్ మంజప్పై (మళ్ళీ పసుపు సంచులు) పథకాన్ని ప్రారంభించామని, ఆ పథకాన్ని ప్రభుత్వ పథకంగా భావించకుండా స్వచ్ఛంద సంస్థలు కూడా ప్లాస్టిక్ నిరోధక ఉద్యమంలో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తంగం తెన్నరసు, దామో అన్బరసన్, రాజకన్నప్పన్, శాసనసభ్యుడు ఇ.కరుణానిధి, అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సుప్రియా సాహు తదితరులు పాల్గొన్నారు.



ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో అటవీ శాఖాధికారులకు అవార్డులు ప్రదానం చేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్



అర్ధరాత్రి రాస్తారోకో చేస్తున్న ప్రయాణికులు

కిలాంబాక్కంలో ప్రయాణికుల రాస్తారోకో
అర్ధరాత్రి కలకలం

ప్యారీస్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన కిలాంబాక్కం కలైంజర్ సెంటినరీ బస్ టెర్మినల్ నుంచి బుధవారం అర్ధరాత్రి వరకు దూర ప్రాంతాలకు వెళ్ళే బస్సులు నడపలేదన్న ఆగ్రహంతో ప్రయాణికులు రాస్తారోకో నిర్వహించారు. కోయంబేడు, మాధవరం ప్రాంతాల నుండి దక్షిణాది జిల్లాలకు నడుపుతున్న బస్సుల సేవలను ఇటీవల కిలాంబాక్కంలో నిర్మించిన బస్ టెర్మినల్‌కు రాష్ట్రప్రభుత్వం మార్చింది. ఈ నేపథ్యంలో, బుధవారం రాత్రి 8 నుండి అర్ధరాత్రి 12 గంటల వరకు దక్షిణాది జిల్లాలకు బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు ఆ బస్‌స్టేషన్ అధికారులను నిలదీశారు. అయితే అధికారులు ఎలాంటి సమాధానం చెప్పకపోవడంతో సుమారు 500 మందికి పైగా ప్రయాణికులు కిలాంబాక్కం బస్‌స్టేషన్ సమీపంలోవున్న జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు. దీంతో జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలిసి అక్కడికి చేరుకున్న పోలీసులు ఆందోళనాకారులను వెళ్లగొట్టేందుకు ప్రయత్నించడంతో వారి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఇదిలా వుండగా, కొంతమంది ప్రయాణికులు రవాణాశాఖ వైఖరిని, ప్రభుత్వాన్ని విమర్శించారు. మహిళల కోసం పెద్దసంఖ్యలో ఉచిత బస్సులు నడుపుతున్న రాష్ట్రప్రభుత్వం దూరప్రాంతాలకు వెళ్ళాల్సిన ప్రయాణికుల గురించి పట్టించుకోవడంలేదని, అసలు బస్సులు నడపకపోవడానికి కారణమేమిటని ప్రశ్నించారు. ఇదిలా వుండగా, చెన్నై, తిరుచ్చి జాతీయ రహదారిలో తెల్లవారుజాము వరకు రాస్తారోకో కొనసాగినందువల్ల సుమారు 3 కిలోమీటర్ల వరకు వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకున్నాయి.

ఖాయిదే మిల్లత్ సేవలు చిరస్మరణీయం

- ముఖ్యమంత్రి స్టాలిన్
- రాజకీయ నేతల ఘననివాళి



అన్నాడీఎంకే తరుపున నివాళులర్పిస్తున్న మాజీమంత్రులు పొన్నయ్యన్, జయకుమార్, బెంజిమెన్ తదితరులు



ఖాయిదే మిల్లత్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న టీఎన్‌సీ అధ్యక్షుడు జీకే వాసన్, నిర్వాహకులు

ప్యారీస్, జూన్ 5: సీనియర్ పార్లమెంటేరియన్‌గా, ముస్లిం నేతగా ఖాయిదే మిల్లత్ మహమ్మద్ ఇస్మాయిల్ అందించిన సేవలు చిరస్మరణీయమని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కొనియాడారు. ఖాయిదే మిల్లత్ 130వ జయంతిని పురస్కరించుకొని గురువారం ట్రిప్లికేన్ నియోజకవర్గ పరిధిలోని ఆదాం మార్కెట్ ప్రాంతంలోవున్న పెద్ద మసీదు ప్రాంగణంలోని ఆయన స్మారక స్థలంలో ముస్లిం మతగురువులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాష్ట్రప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి స్టాలిన్ ఖాయిదే మిల్లత్ సమాధిపై పూలఛాదర్ ఉంచి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం ఖాయిదే మిల్లత్ సేవలను కొనియాడుతూ మతాలకతీతంగా సమాజానికి అంకితభావంతో ఖాయిదే మిల్లత్ అందించిన సేవలు చిరస్మరణీయమని కీర్తించారు. సీఎంతో పాటు రాష్ట్ర మంత్రులు తంగం తెన్నరసు, టీఎం అన్బరసన్, ఎం.సుబ్రమణ్యం, ఆవడి నాజర్, ఎంపీ ఎ.రాజా, మేయర్ ప్రియ, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్ తదితరులు నివాళులర్పించారు. అన్నాడీఎంకే ఆధ్వర్యంలో రాష్ట్ర మాజీమంత్రులు సి.పొన్నయ్యన్, జయకుమార్, బెంజిమెన్, అబ్దుల్ రహీం, మాజీ కౌన్సిలర్ రాయపురం మనో తదితరులు నివాళులర్పించారు. తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సెల్వపెరుందగై నేతృత్వంలో ఎమ్మెల్యే హసన్ మౌలానా తదితరులు నివాళులర్పించారు. తమిళ మానిల కాంగ్రెస్ అధ్యక్షుడు జీకే వాసన్, ప్రధాన కార్యదర్శి జీఆర్ వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు ఈకే అరుణ్‌కుమార్, బిజుచాకో నివాళులర్పించారు. ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో నేతృత్వంలో ఆ పార్టీ నాయకులు నివాళులర్పించారు. ఇదిలా వుండగా తమిళ భాషాభివృద్ధికి ఖాయిదే మిల్లత్ ఎనలేని కృషిచేశారని, ముస్లిం వర్గాల విద్యాభివృద్ధికి, దేశంలో మతసామరస్యం పెంపొందింపజేసేందుకు ఆ మహనీయుడు పార్లమెంటు సభ్యుడిగా అందించిన సేవలు చరిత్రలో నిలిచిపోయాయని ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిస్వామి తన ఎక్స్‌పేజీలో పోస్ట్ చేశారు.



ట్రిప్లికేన్‌లోని ఖాయిదే మిల్లత్ స్మారక స్థలంలో మంత్రులతో కలిసి నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

సమాచార దర్శిని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

రెడ్‌హిల్స్: చోళవరం, సోత్తుపెరుంబేడు కొంత భాగం, కారనోడై కొంత భాగం, ఒరక్కాడు రోడ్డు, కొట్టియమేడు పెరియ కాలని, చెంబులివరం

మొగప్పైర్: పాడి టీవీఎస్ కాలనీ, టీవీఎస్ నగర్, టీవీఎస్ అవెన్యూ, రేడియల్ హౌస్, జీవన్ బీమా నగర్, శివన్ ఆలయం, పడవట్టమ్మన్ ఆలయ వీధి, వళ్లువర్ వీధి.

చెన్నై బీచ్ నుంచి పుదుచ్చేరి మెము

పెరంబూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎగ్మూర్ యార్డ్‌లో మరమ్మతులు కారణంగా చెన్నై ఎగ్మూర్-పుదుచ్చేరి మెము రైలు చెన్నై ఎగ్మూర్‌కు బదులుగా చెన్నై బీచ్ నుంచి బయల్దేరుతుంది. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో... నెం.66051 చెన్నై ఎగ్మూర్-పుదుచ్చేరి మెము ప్యాసింజర్ చెన్నై ఎగ్మూర్‌కు బదులు చెన్నై బీచ్ నుంచి ఉదయం 6.25 గంటలకు బయల్దేరుతుంది. మరుమార్గంలో నెం.66052 పుదుచ్చేరి-చెన్నై ఎగ్మూర్ మెము చెన్నై ఎగ్మూర్‌కు బదులుగా చెన్నై బీచ్‌కు రాత్రి 8.50 గంటలకు చేరుకుంటుంది. ఈ రైళ్లు చెన్నై ఫోర్ట్, చెన్నై పార్క్‌లో స్టేషన్లలో ఆగి వెళతాయని, ఈ మార్పు గురువారం నుంచి ఆగస్టు 8వ తేది వరకు కొనసాగుతుందని దక్షిణ రైల్వే తెలిపింది.

ఇంజనీరింగ్ రెండో ఏడాదిలో ప్రవేశాలు

పెరంబూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): డిప్లొమో ఇన్ ఇంజనీరింగ్, బీఎస్సీ గ్రాడ్యుయేట్లు బీఈ, బీటెక్ రెండో సంవత్సరం కోర్సుల్లో చేరేందుకు శుక్రవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు సాంకేతిక విద్య కమిషనర్ జె.ఇన్నోసెంట్ దివ్య గురువారం విడుదల చేసిన ప్రకటనలో... డిప్లొమో ఇన్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు, బీఎస్సీ గ్రాడ్యుయేట్లు నేరుగా ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో అడ్మిషన్లు పొందవచ్చన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు శుక్రవారం నుంచి www.tnlea.com అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, దరఖాస్తు రుసుముగా రూ.500, ఎస్సీ, ఎస్టీ విభాగాలకు చెందిన వారు రూ.250 ఆన్‌లైన్‌లోనే చెల్లించాలన్నారు. ఆన్‌లైన్ వసతి లేని విద్యార్థులు తమిళనాడు ఇంజనీరింగ్ సర్వీస్ సెంటర్ (టీఎఫ్‌సీ) ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ప్రకటనలో తెలిపారు.

నేటినుంచి మెడిసిన్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

పెరంబూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల ప్రవేశానికి శుక్రవారం నుంచి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్ సహా పలు వైద్య కోర్సుల అడ్మిషన్లకు జాతీయ స్థాయిలో 'నీట్' నిర్వహిస్తుంటారు. ఫలితాలు వెలువడిన అనంతరం విద్యార్థులు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఈ ఏడాది నీట్‌కు దేశవ్యాప్తంగా 20 లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. వాటి ఫలితాలు ఈ నెల మొదటి వారంలో విడుదల చేస్తున్నట్లు గతంలో ప్రకటించారు. కానీ, పలు కారణాలతో ఫలితాలు వాయిదాపడ్డాయి. ఫలితాలు వెలువడి దరఖాస్తు చేసుకొనేందుకు తక్కువ వ్యవధి ఉండడంతో విద్యార్థులు ఇబ్బంది పడే అవకాశముంది. విద్యార్థుల సౌకర్యార్థం పరీక్షా ఫలితాలు వెల్లడించక ముందే దరఖాస్తు స్వీకరణ ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. ఫలితాలు వెలువడిన అనంతరం నీట్‌లో వచ్చిన మార్కుల నమోదుకు అవకాశం కల్పించనున్నట్లు మంత్రి తెలిపారు.

నేడు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అదనపు టోకెన్లు

పెరంబూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): శుభముహూర్తం రోజును పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో శుక్రవారం అదనపు టోకెన్లు అందించనున్నట్లు రిజిస్ట్రేషన్ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, ఒక రిజిస్ట్రార్ ఉన్న కార్యాలయాల్లో అందిస్తున్న వంద టోకెన్లకు బదులు 150, ఇద్దరు రిజిస్ట్రార్లున్న కార్యాలయాల్లో అందిస్తున్న 200 టోకెన్లకు బదులు 300 టోకెన్లు అందించనున్నారు. అధిక పత్రాలు రిజిస్ట్రేషన్లు జరిగే వంద కార్యాలయాల్లో 150 సాధారణ టోకెన్లు, ఇప్పటికే అందజేస్తున్న 12 తత్కాల్ టోకెన్లకు అదనంగా 4 టోకెన్లు అందించనున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలకు రూ.58.86 కోట్లు

పెరంబూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఏకీకృత విద్యా ప్రణాళిక నిర్వహణ నిధుల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు 50 శాతం నిధులు విడుదల చేశారు. కేంద్ర విద్య మంత్రిత్వ శాఖ ప్రణాళిక ఆమోద బృందం, 2025-26 విద్యా సంవత్సరానికి సమగ్ర పాఠశాల విద్యా ప్రణాళిక కొనసాగింపునకు సిఫారసు చేసింది. ఆ ప్రకారం, తొలి విడతగా, అన్ని ప్రభుత్వ పాఠశాలలకోసం జిల్లాల వారీగా నిధులు కేటాయించేలా రూ.58.86 కోట్ల నిధులను సమగ్ర విద్యా పథక డైరెక్టరేట్ విడుదల చేసింది. ఈ నిధులు పాఠశాల నిర్వహణ సంఘాల బ్యాంక్ ఖాతాకు మూడు రోజుల్లో జమచేయాలని ప్రధాన విద్యాధికారులకు డైరెక్టరేట్ ఉత్తర్వులు జారీచేసింది.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎగ్మూర్, ఆవడి, పెరంబూర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ గ్రీవెన్స్ జరుగనుంది. ఈ మేరకు విద్యుత్ బోర్డు విడుదల చేసిన ప్రకటనలో... ఎగ్మూర్ పరిధిలో వెప్పేరి ఈవీకే సంపత్ రోడ్డులోని సబ్ స్టేషన్ ప్రాంగణంలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయం, ఆవడి పరిధిలో ఎస్ఎం నగర్ మురుగప్ప పాలిటెక్నిక్ సమీపం సబ్ స్టేషన్ ప్రాంగణంలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయం, పెరంబూర్ పరిధిలో సింప్సన్ ఎంఈఎస్ రోడ్డు సబ్ స్టేషన్ ప్రాంగణంలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయాల్లో ఉదయం 10.30 గంటలకు జరిగే గ్రీవెన్స్‌లో ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు పాల్గొని సమస్యలు తెలిపి పరిష్కారం పొందవచ్చని విద్యుత్ బోర్డు విజ్ఞప్తి చేసింది.

రేపు డీఎంకే జిల్లా కార్యదర్శుల సమావేశం

పెరంబూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ నేతృత్వంలో ఈ నెల 7వ తేది జిల్లా కార్యదర్శుల సమావేశం జరుగనుంది. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ విడుదల చేసిన ప్రకటనలో... పార్టీ అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ నేతృత్వంలో జిల్లా కార్యదర్శులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జులతో శనివారం ఉదయం 10.30 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. సమావేశంలో పార్టీలో కొత్త సభ్యుల చేర్పించడంపై ప్రధానంగా చర్చ జరుగుతుందని పార్టీ ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ తెలిపారు.

మూతపడనున్న టైప్ శిక్షణా కేంద్రాలు?

● అయోమయంలో 4.5 లక్షల మంది టీచర్లు



ప్యారీస్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టైప్ రైటింగ్ పరీక్షలను రద్దు చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో సుమారు 4,500 టైపింగ్ శిక్షణా కేంద్రాలు మూతబడనున్నాయి. దీంతో అక్కడ పనిచేస్తున్న దాదాపు 4.5 లక్షల మంది ఉపాధి కోల్పోయే అవకాశముంది. ఇందువల్ల ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవల్సిందిగా టీచర్ల సంక్షేమ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలో 4 లక్షల మందికి పైగా విద్యార్థిని, విద్యార్థులు టైప్ రైటింగ్ పరీక్షలకు హాజరవుతున్నారు. టైపింగ్ శిక్షణా కేంద్రాలు ప్రభుత్వం నుండి లైసెన్సులు పొంది పనిచేస్తున్నాయి. వీటిలో 4.5 లక్షల మంది టీచర్లు పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో, 2025-2026 విద్యాసంవత్సరానికి సంబంధించిన టైపింగ్ పరీక్షలు టైప్ రైటింగ్ యంత్రాల ద్వారా జరుగుతాయని, 2027 తర్వాత కంప్యూటర్ ఉపయోగించి మాత్రమే నిర్వహిస్తామని రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ప్రకటనతో టైపింగ్ శిక్షణా కేంద్రాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఆందోళనకు గురయ్యారు. ప్రభుత్వ నిర్ణయంపై టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్‌కు చెందిన ఓ అధికారి మాట్లాడుతూ.. ఉన్నత విద్యాశాఖ గతంలో జారీచేసిన ఉత్తర్వుల మేరకు రాష్ట్రంలో టైపింగ్ పరీక్షలు 2027 నుండి ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారని తెలిపారు. ఇందుకోసం ఓ సాఫ్ట్‌వేర్ సంస్థను కూడా రాష్ట్రప్రభుత్వ ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా, వేలూరులోని 25 టైప్ రైటింగ్ శిక్షణా కేంద్రాల యజమానులు జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మికి వినతి పత్రం సమర్పించారు. అందులో టైప్ రైటింగ్ పరీక్షా విధానాన్ని రాష్ట్రప్రభుత్వ మార్పు చేస్తున్నందు వల్ల రాష్ట్రంలో తమ భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉందని విన్నవించుకున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి టైపింగ్ పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో, తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల సుమారు 10 వేల మందికి పైగా టైపింగ్ యంత్రాల నిపుణులు, వారి కుటుంబాలు జీవనాధారం కోల్పోయే అవకాశం ఉందని ఆ వినతిపత్రంలో సూచించారు. మరోవైపు టైపింగ్ శిక్షణా కేంద్రాలు మూతబడితే, విద్యార్థులు కంప్యూటర్ శిక్షణా కేంద్రాల వైపు మొగ్గు చూపుతారని టైపింగ్ శిక్షణా నిపుణులు చెబుతున్నారు. విద్యార్థుల్లో టైపింగ్ వేగం తగ్గుతుందని, టైప్ రైటర్‌లో నేర్చుకునే సమయాల్లో మాత్రమే 8వేళ్లు వేగంగా పనిచేస్తాయని అందువల్ల శరీరంలో రక్తప్రసరణ సాఫీగా ఉంటుందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. కంప్యూటర్లలో నేర్చుకునే విద్యార్థులు కేవలం రెండు వేళ్లు మాత్రమే ఉపయోగించుకుంటారని, టైపింగ్‌లోవున్న వేగం ఉండదన్నారు. టైపింగ్ శిక్షణా కేంద్రాల్లో నెల ఫీజుగా రూ.400 వసూలు చేస్తున్నామని, కంప్యూటర్ శిక్షణా కేంద్రాల్లో నెల రూ.3వేలు వసూలు చేస్తున్నారని, విద్యార్థుల తల్లిదండ్రులపై ఫీజుల భారం పెంచేలా తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్రప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

● రాజ్యసభ ఎన్నికలు...

నేడు అన్నాడీఎంకే అభ్యర్థుల నామినేషన్

పెరంబూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ ఎన్నికల్లో పోటీచేస్తున్న అన్నాడీఎంకే అభ్యర్థులు శుక్రవారం నామినేషన్ దాఖలుచేయనున్నారు. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రంలో ఖాళీ అవుతున్న ఆరు రాజ్యసభ సభ్యుల ఎన్నిక ఈ నెల 19వ తేది జరుగుతుందని ఎన్నికల సంఘం ప్రకటించిందన్నారు. వీటిలో రెండు సీట్లు విజయం సాధించే అవకాశమున్న అన్నాడీఎంకే, ఈ స్థానాలకు అభ్యర్థులను పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి నేతృత్వంలో ఎంపిక చేశారన్నారు. ఈ స్థానాలకు పార్టీ న్యాయవాదుల విభాగం కార్యదర్శి ఇన్బదురై, చెంగల్పట్టు తూర్పు జిల్లా పార్టీ అణ్ణై అధ్యక్షుడు ధనపాల్‌ను అభ్యర్థులుగా ఎంపిక చేస్తూ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారని తెలిపింది. ఈ నేపథ్యలో ధనపాల్, ఇన్బదురై శుక్రవారం మధ్యాహ్నం 12.45 గంటలకు నామినేషన్ దాఖలు చేయనున్నారని ఆ పార్టీ ప్రకటనలో తెలిపింది.

రాష్ట్రంలో కులగణన జరపాల్సిందే

● పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి

ప్యారీస్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తక్షణం కులగణన జరపాలని పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన గురువారం విడుదల చేసిన ప్రకటనలో దేశవ్యాప్తంగా 2027 మార్చి 1వ తేదీ నుండి జనగణన చేపట్టనున్నట్లు కేంద్రప్రభుత్వం తెలిపిందని, జనగణనతో పాటే కులగణన కూడా చేపట్టనున్నట్లు ప్రకటించిందని, అయితే కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న కులగణనలో ఆర్థిక, విద్యాపరంగా వెనకబడిన ప్రజల వివరాలు పూర్తిగా బయటికి రావన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం అమలుపరుస్తున్న 69శాతం రిజర్వేషన్లకు నష్టం వాటిల్లే అవకాశముందని, రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో దాఖలు చేసిన కేసులు ఏ నిమిషంలోనైనా విచారణకు వస్తాయని, ఆలోపు రాష్ట్రంలో కులగణనను పూర్తిచేయాలని అన్బుమణి డిమాండ్ చేశారు.

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తిచేయండి

● అధికారులకు ఎంపీ కదిర్ ఆనంద్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కదిర్ ఆనంద్

వేలూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని రైల్వేశాఖలో చేపట్టిన అభివృద్ధి పనులపై వేలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎంపీ కదిర్ ఆనంద్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులను సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అమ్ములు, జిల్లా పంచాయతీ కమిటీ అధ్యక్షులు బాబు, జిల్లా ఎస్పీ మదివానన్, వీఆర్వో మాలతి, కాంచన సహా పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

పెరిగిన విద్యుత్ వినియోగం

పెరంబూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల ప్రారంభం, ఎండ తీవ్రత కారణంగా రాష్ట్రంలో విద్యుత్ వినియోగం పెరిగింది. రాష్ట్రంలో ఒకరోజు సరాసరి విద్యుత్ వినియోగం 30 కోట్ల యూనిట్లుంటుంది. 2024 ఏప్రిల్ 30వ తేది విద్యుత్ వినియోగం గరిష్ఠంగా 45.43 కోట్ల యూనిట్లకు చేరుకుంది. ఈ ఏడాది వేసవి సీజన్‌లో విద్యుత్ వినియోగం అధికమవుతోందని విద్యుత్ బోర్డు అధికారులు భావించారు. కానీ, ఏప్రిల్ నెలాఖరు నుంచి చెన్నై సహా పలు జిల్లాల్లో కురిసిన చెదురుమదురు వర్షాలతో చల్లటి వాతావరణం నెలకొని విద్యుత్ వినియోగం తగ్గింది. ఈ నేపథ్యంలో, ఈ నెల 1వ తేది విద్యుత్ వినియోగం 33.75 కోట్ల యూనిట్లుగా నమోదైంది. 2వ తేది నుంచి పాఠశాలల ప్రారంభం, ఎండ తీవ్రత పెరగడంతో విద్యుత్ వినియోగం 38.69 కోట్ల యూనిట్లు, 3వ తేది 41.16 కోట్ల యూనిట్లకు పెరిగిందని అధికారులు తెలిపారు.

రేపటి నుంచి సైక్లింగ్ లీగ్

చెన్నై, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'తమిళనాడు సైక్లింగ్ లీగ్ (టీసీఎల్) ఈ నెల 7న ప్రారంభం కానుంది. 7,8 తేదీల్లో చెన్నైలోని ఐకానిక్ నేపియల్ బ్రిడ్జి వద్ద తన మూడవ సీజన్ కోసం తిరిగి రానుంది. ఈ వేదిక 3.5 కి.మీ చెన్నై ఫార్ములా రేసింగ్ సర్క్యూట్‌లో భాగంగా ఉండడం గమనార్హం. టీసీఎల్ తమిళనాడు అంతటా అగ్రశ్రేణి ప్రతిభను ఒకచోట చేర్చడమే కాకుండా జూన్ 8న జరుగనున్న 'గ్రీన్ రైడ్' అనే ఆకర్షణీయమైన కమ్యూనిటీ చొరవను కూడా పరిచయం చేస్తుంది. ఈ గ్రీన్‌రైడ్ ఉదయం 5.30 గంటలకు నేపియల్ బ్రిడ్జి వద్ద ప్రారంభమవుతుంది. దీని గురించి టీసీఎల్ అధ్యక్షుడు ఎం.సుధాకర్ మాట్లాడుతూ.. గత సంవత్సరం 500 మందికి పైగా పాల్గొన్నారని, ఈ సంవత్సరం 1,500 మంది పాల్గొనే అవకాశముందని వివరించారు.

మదురై సమీపంలో 800 ఏళ్ళనాటి శివాలయం



శివాలయం శిలాఫలకాన్ని పరిశీలిస్తున్న పురావస్తుశాఖ నిపుణులు

ప్యారీస్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మదురై సమీపంలో పురావస్తు శాఖ జరిపిన పరిశోధనలో సుమారు 800 ఏళ్ళనాటి శివాలయం బయల్పడింది. పురావస్తుశాఖ చరిత్రలో ఇదో మైలురాయి అని ఆ శాఖ నిపుణులు హర్షం వ్యక్తంచేశారు. పురాతన శివాలయం బయటపడటంపై పురావస్తు పరిశోధన శాఖ నిపుణులు దేవీ, అరివిసెల్వం మీడియాతో గురువారం వివరించారు. మదురై జిల్లా మేలూర్ మండలం సిట్రూర్‌వుడన్‌పట్టి గ్రామంలో చేపట్టిన తవ్వకాల్లో పురాతన శి వాలయం బయల్పడిందని తెలిపారు.ఈ ఆలయ కట్టడంలో 10కి పైగా శిలాఫలకాలను గుర్తించామని,వాటిలో ఒకదానిపై ఈ ఊరిపేరు 'ఆట్రూర్' అని చెక్కినట్లు తెలిపారు. శిథిలావస్థకు చేరుకున్న శివాలయ మూలవర్ పేరు 'తెన్నవనీశ్వర' అని, 1217-1218వ శతాబ్దంలో ఈఆలయం సుందర పాండ్యన్ రాజవంశస్థులు నిర్మించినట్లు శిలాఫలకంలో ఉందని తెలిపారు. గర్భగుడి, ఆర్థమండపం, మహామండపం, ప్రవేశద్వారంతో నిర్మించిన ఈ శివాలయంలో పరివార దేవతలుగా వినాయకుడు, దక్షిణామూర్తి, అమ్మవార్లను కొలుదీర్చినట్లు శిలాఫలకంలో స్పష్టంగా ఉందన్నారు.

లెవల్ క్రాసింగ్ వద్ద అప్రమత్తంగా ఉండాలి

● చెన్నై రైల్వే డివిజన్ అవగాహన ప్రచారం



ప్లకార్డులతో అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

పెరంబూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): లెవల్ క్రాసింగ్‌ల వద్ద ప్రజలు, వాహన చోదకులు అప్రమత్తంగా ఉండాలంటూ చెన్నై రైల్వే డివిజన్ ఆధ్వర్యంలో అవగాహన ప్రచారం చేపట్టారు. రైళ్లు వెళ్లే సమయానికి ముందు కొన్ని ప్రాంతాల్లో గేట్లు వేస్తుంటారు. కానీ, కొందరు గేట్లు దాటి రైళ్లు ఢీకొని మృతిచెందిన ఘటనలు సంభవిస్తున్నాయి. లెవల్ క్రాసింగ్ వద్ద చేపట్టాల్సిన చర్యలపై ప్రజలు, వాహన చోదకులకు అవగాహన కల్పించేలా పల్లావరం-తాంబరం మధ్యలోని నెం.26 లెవల్ క్రాసింగ్ వద్ద విద్యార్థులు గురువారం ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో అడిషినల్ డివిజినల్ రైల్వే మేనేజర్ తేజ్‌ప్రతాప్ సింగ్, సీనియర్ డివిజినల్ సేఫ్టీ ఆఫీసర్ ఆర్.సత్యశీలన్ సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.

తాగునీరు సరఫరా చేయరా?

● వేళచ్చేరి సమస్యలపై అన్నాడీఎంకే ధర్నా

● మాజీ మంత్రి వలర్మతి సహా కార్యకర్తల అరెస్ట్



ధర్నాలో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి వలర్మతి

పెరంబూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక తరమణి పెరియార్ నగర్, చుట్టుపక్కల ప్రాంతాలకు తాగునీరు సక్రమంగా సరఫరా చేయాలని, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు అడ్డుకోవాలని కోరుతూ స్థానికులు చేపడుతున్న ఆందోళనలకు ప్రతిపక్ష అన్నాడీఎంకే మద్దతు ప్రకటించింది. ఈ డిమాండ్లతో గురువారం తరమణిలో ధర్నా నిర్వహించిన మాజీ మంత్రి వలర్మతి సహా 500 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. పెరియార్ నగర్, చుట్టుపక్కల ప్రాంతాల్లో సుమారు 2 వేల కుటుంబాలకు పైగా నివసిస్తున్నాయి. కొన్ని నెలలుగా ఈ ప్రాంతంలో రెండు, మూడు రోజులకు ఒకసారి నీరు సరఫరా చేస్తుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అలాగే, ఆ ప్రాంతంలో ప్రభుత్వ స్థలాలను పలువురు ఆక్రమిస్తున్నారనే ఆరోపణలున్నాయి. తాగునీరు సక్రమంగా సరఫరా చేయాలి, ఆక్రమణ తొలగించాలి తదితర డిమాండ్లతో ఆ ప్రాంత ప్రజలు గతంలో రెండు సార్లు ఆందోళనలు నిర్వహించారు. స్థానికులకు మద్దతుగా అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే వేళచ్చేరి అశోక్ నేతృత్వం వహించిన ఆందోళనల్లో మాజీ మంత్రి వలర్మతి సహా కార్యకర్తలు పాల్గొని, సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. ఆందోళనకు అనుమతి లేదంటూ వలర్మతి సహా 500 మందిని పోలీసులు అరెస్ట్ చేసి సమీపంలోని కల్యాణ మండపానికి తరలించారు.

కమల్ వ్యాఖ్యలపై డీఎంకే స్పందించదా?

● బీజేపీ నాయకురాలు తమిళిసై



మీడియాతో మాట్లాడుతున్న తమిళిసై సౌందరరాజన్

వేలూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): నటుడు, ఎంఎన్ఎం అధినేత కమల్‌హాసన్ కన్నడ భాషపై చేసిన వ్యాఖ్యలు రెండు రాష్ట్రాల మధ్య విభేదాలకు దారితీసేలా ఉన్నాయని బీజేపీ సీనియర్ నాయకురాలు తమిళిసై సౌందరరాజన్ ఆరోపించారు. వేలూరు జిల్లా గుడియాత్తంలోని రోటరీ క్లబ్‌లో గురువారం ఉదయం రాణి అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతి సందర్భంగా ఆమె నివాళులర్పించారు. అనంతరం మీడియా సమావేశంలో తమిళిసై మాట్లాడుతూ, ఎంఎన్ఎం అధ్యక్షుడు కమల్‌హాసన్ కన్నడ భాషపై ఇటీవల చేసిన వ్యాఖ్యలపై డీఎంకే నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం స్పందించలేదన్నారు. తమిళ భాషను ప్రేమిస్తూనే మిగతా భాషలను కూడా గౌరవించాలన్న విషయం కమల్‌కు తెలీదా? అని విమర్శించారు. విమర్శలకు దారితీస్తున్న ఈ వ్యాఖ్యలపై చర్యలు తీసుకోకపోతే రెండు రాష్ట్రాల ప్రజల మధ్య విభేదాలు చోటుచేసుకుంటాయని తమిళిసై అన్నారు.

ప్రభుత్వ బస్సుల్లో 'తమిళనాడు' పేరు తొలగింపా?

● మంత్రి శివశంకర్ వివరణ

ప్యారీస్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బస్సుల్లో 'తమిళనాడు' అనే పేరు తొలగించారనే వివాదంపై స్పందించిన రవాణాశాఖ మంత్రి ఎస్ఎస్ శివశంకర్ తమిళనాడు పేరును తాము తొలగించలేదని స్పష్టంచేశారు. ఆయన గురువారం అరియలూరు జిల్లా సిందురైలో మీడియాతో మాట్లాడుతూ, 2012వ సంవత్సరం ముఖ్యమంత్రిగా వ్యవహరించిన జయలలిత ప్రభుత్వం తరుపున కొత్తబస్సులను ప్రారంభించిన సమయంలోనే 'తమిళనాడు ప్రభుత్వ రవాణా సంస్థ' అనే పేరుందని, అప్పటినుంచి ఈ పేరులో ఎలాంటి మార్పులు చేయలేదన్నారు. తమిళనాడు ప్రభుత్వ రవాణా సంస్థ, తిరునల్వేలి, తమిళనాడు ప్రభుత్వ రవాణా సంస్థ, కుంభకోణం అని పొడవుగా ఉన్నందువల్ల బస్సు ముందు భాగంలో రాస్తే ప్రయాణికులు చదివేందుకు ఇబ్బంది కరంగావుంటుందని, 13ఏళ్ళకు ముందే ప్రభుత్వ రవాణా సంస్థ పేరు బస్సుల్లో ఉండేదన్నారు. 20221లో డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రవాణా సౌకర్యాంలేని ప్రాంతాలకు బస్సులు నడిపేలా కొత్తరూట్లు రూపొందించామని, మినీ బస్సు సేవలను ఈ ప్రాంతాలకు విస్తరింపజేసినట్లు తెలిపారు. అలాగే ఈ ఏడాది కొత్తగా బస్సులు కొనుగోలు చేసి, రవాణా సంస్థకు సరఫరా చేసినట్లు తెలిపారు. గత సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ రవాణా సంస్థలు నడిపిన బస్సులు 7.20 లక్షల మంది రిజర్వేషన్ చేసుకుని ప్రయాణం చేశారని, అంతకు ముందు సంవత్సరంలో 6.60 లక్షల మంది ప్రయాణం చేసినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ బస్సులపై ప్రజల్లో నమ్మకం ఏర్పడటం చూసి ఓర్వలేకే కొంత మంది రవాణా సంస్థపై ఇలాంటి పుకార్లు సృష్టిస్తున్నారని మంత్రి ఎస్ఎస్ శివశంకర్ పేర్కొన్నారు.

10న నాటు పడవల తనిఖీ

పెరంబూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువాన్మియూర్ కుప్పం నుంచి ఎన్నూర్ శివన్‌పడైకుప్పం వరకు ఉన్న జాలర్లకు చెందిన నాటు పడవల తనిఖీలు ఈ నెల 10వ తేది చేపట్టనున్నారు. ఈ మేరకు మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ తిరునాగేశ్వరన్, నాటు పడవల యజమానుల సంఘం, జాలర్ల గ్రామాల పంచాయతి అధ్యక్షులకు సర్క్యులర్ పంపించారు. తనిఖీ సమయంలో పడవ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, డీజిల్ సబ్సిడీ పుస్తకం, యజమాని ఆధార్ కార్డు, రేషన్ కార్డు తదితర పత్రాలు అధికారులకు చూపించాలన్నారు. పడవ రిజిస్ట్రేషన్ నెంబరు స్పష్టంగా తెలిసేలా రాయించాలన్నారు. తనిఖీ సమయంలో పడవకు ఇంజన్లు అమర్చి ఉండాలన్నారు. తనిఖీలకు సహకరించని పడవల రిజిస్ట్రేషన్ రద్దు చేయడంతో పాటు సబ్సిడీ డీజిల్ రద్దు చేస్తామని హెచ్చరించారు. తనిఖీలకు వచ్చే అధికారులకు నాటు పడవల యజమానులు సహకరించి, తమ పడవలను సిద్ధం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మామపై వేడి నీళ్లు పోసిన కోడలు

పెరంబూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మామపై ఆగ్రహించిన కోడలు, ఆయనపై వేడి నీళ్లు కుమ్మరించిన ఘటన కన్నియాకుమారిలో చోటుచేసుకుంది. మార్తాండం సమీపం బాగోడుమదికావిలై ప్రాంతానికి చెందిన దేవరాజ్-మరియజాయ్ దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. వారిలో రెండో కుమారుడు సంతోష్‌కుమార్ భార్య సైనిమోల్ కు మామ దేవరాజ్ మధ్య తరచు గొడవలు జరుగుతున్నాయి. ఘటన జరిగిన రోజున వారిద్దరిమధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. ఆగ్రహం చెందిన సైనిమోల్ వేడి నీళ్లు తెచ్చి మామపై పోసి, దాడిచేసింది. తీవ్రంగా గాయపడిన దేవరాజ్‌ను కుటుంబ సభ్యులు కుళిత్తురై ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై బాధితుడి భార్య మరియజాయ్ అందజేసిన ఫిర్యాదుపై కేసు నమోదుచేసిన మార్తాండం పోలీసులు, సైనిమోల్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఆమ్నీ బస్సుల్లో రూ.35 లక్షల స్వాధీనం

పెరంబూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కడలూరు సమీపంలోని ఆమ్నీ బస్సులో తరలిస్తున్న రూ.35 లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కడలూరు ఆల్‌పేట చెక్‌పోస్ట్‌లో బుధవారం రాత్రి పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో చెన్నై నుంచి నాగపట్టణం వెళ్తున్న ఆమ్నీ బస్సులో తనిఖీ చేశారు. బస్సులో ఓ యువకుడిని అనుమానించిన పోలీసులు, అతడి బ్యాగు పరిశీలించగా రూ.35 లక్షల నగదు లభ్యమైంది. దీంతో, అతడిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. తాను చెన్నై నుంచి ఈ నగదు తీసుకొస్తున్నానని, నగదుకు సంబంధించిన పత్రాలు తీసుకొస్తానని ఆ యువకుడు పోలీసులకు తెలిపాడు. దీంతో, నగదు పోలీస్‌స్టేషన్‌లో ఉంచిన పోలీసులు పత్రాలు తీసుకురావాలని, అవి చూపితే నగదు అప్పగిస్తామని చెప్పి అతడిని పంపించారు.

మసినకుడి వద్ద పులి సంచారం

● ఫారెస్ట్ జీపులో పాఠశాలకు విద్యార్థులు



పులిసంచారంపై హెచ్చరికలు చేస్తున్న అటవీశాఖ అధికారులు

చెన్నై, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా మసినకుడి వద్ద పులి సంచరిస్తుండటం ఆ గ్రామానికి చెందిన విద్యార్థులను అటవీ శాఖ అధికారులు తమ వాహనాల్లో రోజూ స్కూళ్ళకు తీసుకెళ్తున్నారు. మసినకుడి, పావనల్లా ప్రాంతాల్లో ఇటీవల ఓ పులి సంచరించింది. పగటిపూటే సంచరించిన పులిని గ్రామాల్లో ఉండే యువకులు చూసి అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఫారెస్ట్ రేంజర్ ధనపాల్ నాయకత్వంలో 20 మంది అటవీశాఖ ఉద్యోగులు నిఘా వేస్తున్నారు. ఆ పులి సంచారం సుమారు 24 చోట్ల సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేశారు. ఈ పరిస్థితుల్లో ఆ ప్రాంతాలకు చెందిన ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల విద్యార్థులను అటవీ శాఖ అధికారులు ఫారెస్ట్ వాహనాలలో రోజూ తీసుకెళ్ళి, సాయంత్రం ఇళ్ల వద్ద విడిచిపెడుతున్నారు.

21 కిలోల గంజాయి స్వాధీనం

● కోవైలో యూపీ యువకుడి అరెస్ట్



గంజాయితో పట్టుబడిన ఉత్తరప్రదేశ్ యువకుడి

ప్యారీస్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల నగరం కోయంబత్తూరులో వాహనాల తనిఖీల్లో పాల్గొన్న పోలీసులు ఆ ప్రాంతంలో అక్రమంగా తరలిస్తున్న 21 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ యువకుడిని అరెస్టు చేశారు. కోవై సిటీ పోలీస్ కమిషనర్ శరవణన్ సుందరన్ జారీచేసిన ఉత్తర్వుల మేరకు ఎక్సైజ్ విభాగం పోలీసులు తెలుంగు పాళయం వేడపట్టి రోడ్డులో గురువారం ఉదయం వాహనాల తనిఖీల్లో పాల్గొన్నారు. అప్పుడు ఆ మార్గంలో వేగంగా ద్విచక్ర వాహనంలో వెళ్ళిన వ్యక్తిని అడ్డుకుని విచారించగా, అతను పొంతనలేని సమాధానాలు చెప్పడంతో అనుమానం వచ్చిన పోలీసులు ద్విచక్రవాహనంలో తరలించిన బ్యాంగులను తనిఖీ చేసి, వాటిలో ఉన్న 21 కిలోల గంజాయి, రూ.26వేల నగదు, 2 డిజిటల్ పరికరాలు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని ఆ యువకుడిని కోర్టు ఉత్తర్వుల మేరకు రిమాండ్‌కు తరలించారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన బస్సు

● మహిళ మృతి



పొలాల్లోకి దూసుకెళ్లిన బస్సు

పెరంబూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి ప్రభుత్వ బస్సు పొలాల్లోకి దూసుకెళ్లిన ఘటనలో మహిళ మృతిచెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. తెన్‌కాశి జిల్లా అలంకుళం నుంచి గురువారం ఉదయం ప్రభుత్వ బస్సు బయల్దేరింది. మార్గమధ్యంలో బస్సు హఠాత్తుగా అదుపుతప్పి పొల్లాలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో జయలక్ష్మి అనే ప్రయాణికురాలికి తలకు బలమైన గాయం కావడంతో ఘటనా స్థలంలోనే మృతిచెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు వారిని రక్షించి 108 అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు. బస్సు స్టీరింగ్ రాడ్ విరిగిపోవడమే ప్రమాదానికి కారణమని పోలీసుల ప్రాథమిక విచారణలో తెలిసింది.

ఈరోడ్‌లో బంగ్లా దంపతుల అరెస్టు



చెన్నై, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ నగరం వీరప్పన్ సత్రం వద్ద వీసా లేకుండా ఉంటున్న బంగ్లాదేశ్‌కు చెందిన దంపతులను పోలీసులు అరెస్టు చేశారు. వీరప్పన్‌సత్రం కామరాజ్‌నగర్‌లో ఓ ఇంటిలో నివసిస్తున్న దంపతుల ప్రవర్తనపై అనుమానం కలిగిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి వెళ్ళి విచారించగా వారిద్దరూ బంగ్లాదేశ్‌కు చెందిన బబ్లూ సర్దార్ (37), ఆయన భార్య రిబియా కాడున్ (37) అని వెల్లడైంది. వీరికి ఇద్దకు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. ఆ దంపతుల దగ్గర నకిలీ ఆధార్‌కార్డులు, పాస్‌పోర్టులు, వీసా ఉన్నట్లు తెలియటంతో వారిని అరెస్టు చేశారు.

లంక శరణార్థులకు ద్వంద్వ పౌరసత్వం కల్పించాలి : దర్శకుడు వేదాజీ

● విడుదలకు సిద్ధమైన 'ఇరవు పరవై'

చిత్రజ్యోతి

భారత్‌కు శరణార్థులుగా వచ్చే ఈలం తమిళ ప్రజలకు ద్వంద్వ పౌరసత్వం కల్పించాలన్న ప్రధాన ఇతివృత్తంతో తెరకెక్కించిన చిత్రం 'ఇరవు పరవై'. సత్య, నందిని జంటగా నటించిన ఈ చిత్రంలో నిళల్‌గల్ రవి, శివ డాక్టర్ ఆర్.పాండియన్, సెల్వ కుమార్ తదితరులు ఇతర పాత్రలు పోషించారు. కథ, స్ర్కీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం వహించిన వేదాజీ పాండియన్ ఈ చిత్రం గురించి మీడియాతో మాట్లాడుతూ, 'శ్రీలంకలో సుదీర్ఘకాలంగా నెలకొన్న పరిస్థితులు, పేదరికం, నిరుద్యోగం తదితర కారణాలతో భారత్‌కు అనేక మంది ఈలం తమిళులు శరణార్థులుగా వస్తుంటారు. ఇలాంటివారిని రామనాథపురం జిల్లాలోని రామేశ్వరం, మండపం వంటి ప్రాంతాల్లోని శరణార్థ శిబిరాల్లో ఉంచుతున్నారు. రెండు తరాలుగా ఉండే వారికి కూడా భారత ప్రభుత్వం ఎలాంటి పౌరసత్వం కల్పించడం లేదు. ఇలాంటి వారికి కేంద్ర ప్రభుత్వం పౌరసత్వం కల్పించాలన్న ప్రధాన ఇతివృత్తంతో ఈ సినిమా తీశాం. వాస్తవానికి భారత రాజ్యాంగం ప్రకారం ఇది విరుద్ధం. కానీ, శరణార్థులుగా ఈలం తమిళులు ఎదుర్కొనే సమస్యను వెల్లడించడమే తమ ప్రధాన ఉద్దేశం. సినిమా చూసిన సెన్సార్ సభ్యులు కూడా ప్రత్యేకంగా అభినందించారు. ఇటీవల వచ్చిన 'టూరిస్ట్ ఫ్యామిలీ' మూవీలో మానవసంబంధాలను ప్రస్తావించారు. బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. ఖచ్చితంగా మా చిత్రం కూడా ప్రేక్షకాదారణ పొందుతుందన్న గట్టినమ్మకం ఉంది. కడలూరు జిల్లాలోని ఓ గ్రామంలో చిత్రీకరణ పూర్తి చేశాం. రాష్ట్ర వ్యాప్తంగా డాక్టర్ టీఆర్ పాండియన్ ప్రొడక్షన్ చిత్రాన్ని విడుదల చేస్తుంది' అని వివరించారు. ఈ సమావేశంలో పంపిణీదారుడు డాక్టర్ టీఆర్ పాండియన్, సంగీత దర్శకుడు ఆల్విన్ కళై భారతి తదితరులు పాల్గొన్నారు.



'ఇరవు పరవై'లో నందిని

ఎన్నికలు నిర్వహిస్తే భవన నిర్మాణ పనులకు ఆటంకం : విశాల్



నడిగర్ సంఘానికి ఎన్నికలు నిర్వహిస్తే సంఘ భవన నిర్మాణ పనులకు ఆటంకం కలుగుతుందని, అందుకే నడిగర్ సంఘ సభ్యుల పదవీ కాలం మూడేళ్ళపాటు పొడిగించినట్టు హీరో, ఆ సంఘం ప్రధాన కార్యదర్శి విశాల్ మద్రాస్ హైకోర్టుకు తెలిపారు. నడిగర్ సంఘం బై లా ప్రకారం ప్రతి మూడేళ్ళకు ఒకసారి ఎన్నికలు నిర్వహించాలి. ఆ ప్రకారంగా 2022లో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా నాజర్, ప్రధాన కార్యదర్శిగా విశాల్, కోశాధికారిగా కార్తి, ఉపాధ్యక్షులుగా పూచ్చి మురుగన్, కరుణాస్ తదితరులు ఎన్నికయ్యారు. అయితే, వీరి పదవీకాలం గత మార్చితో పూర్తయింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత కమిటీ సభ్యుల పదవీకాలాన్ని మూడేళ్ళపాటు పొడగిస్తూ 2024, సెప్టెంబరు 8వ తేదీ జరిగిన నడిగర్ సంఘం సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ నటుడు నంబిరాజన్ హైకోర్టులో పిటిషన్ వేయగా, దాన్ని విచారణకు స్వీకరించిన కోర్టు నడిగర్ సంఘానికి నోటీసు జారీ చేసింది. దీంతో విశాల్ హైకోర్టులో ఒక అఫడవిట్ దాఖలు చేశారు. 'నడిగర్ సంఘ భవనాన్ని రూ.25 కోట్లతో నిర్మాణం చేపట్టి 60 శాతం మేరకు పనులు పూర్తి చేశాం. మా పదవీకాలం ముగిసినప్పటికీ 2025-28 సంవత్సరానికి కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకుంటే భవన నిర్మాణ పనులకు ఆటంకం కలుగుతుంది. అందువల్ల ఈ ప్రస్తుత కార్యవర్గాన్ని మరో మూడేళ్ళపాటు పొడిగిస్తూ సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశాం. ఈ పిటిషన్ దాఖలు వెనుక స్వార్థం ఉంది. అందువల్ల పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు. ఇరువర్గాల వాదనలు ఆలకించిన కోర్టు తదుపరి విచారణను జూన్ 9వ తేదీకి వాయిదా వేసింది.

సినిమా అవార్డులను ప్రదానం చేయండి

● యాక్టివ్ నిర్మాతల సంఘం



భారతీరాజా

2016 సంవత్సరం నుంచి పెండింగ్‌లో ఉన్న సినిమా అవార్డులను ప్రదానం చేయాలని భారతీరాజా సారథ్యంలోని తమిళ సినీ నిర్మాతల సంఘం (యాక్టివ్ ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్) రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ప్రభుత్వానికి ఒక లేఖ రాసింది. 'ఇందులో తమిళ సినిమాల నుంచి వసూలు చేసే ఎల్.బి.ఈ.టి 8 శాతం నుంచి 4 శాతానికి తగ్గించినందుకు ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధికి, తమిళ చిత్రపరిశ్రమ అభివృద్ధికి సహకరిస్తున్న సీఎంకు ధన్యవాదాలు తెలిపారు అలాగే 2016 నుంచి 2022 వరకు తమిళ చిత్రాలకు అవార్డులు, రాయితీలు ఇచ్చేందుకు దరఖాస్తులను ఆహ్వానించింది. కానీ, ఏడేళ్ళుగా అవార్డులతోపాటు సబ్సిడీ ప్రకటించలేదు. ఈ విషయంపై ప్రభుత్వం దృష్టిసారించి, ఏడేళ్ళుగా పెండింగ్‌లో ఉన్న అవార్డులను ప్రదానం చేయాలని యాక్టివ్ నిర్మాతల సంఘం ఒక ప్రకటనలో కోరింది.

విజయ్ ఆంటోనీ చిత్రంలో శ్వాసిక

శశి దర్శకత్వంలో విజయ్ ఆంటోనీ నటించే కొత్త చిత్రంలో శ్వాసిక ఒక ముఖ్య పాత్ర పోషించనున్నారు. 'పిచ్చైకారన్' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో రూపొందనుంది. ఇందులో ఓ కీలక పాత్ర కోసం శ్వాసికను ఎంపిక చేశారు. రాష్ట్రంలో జరిగిన యధార్థ సంఘటన ఆధారంగా తెరకెక్కనుంది. ప్రస్తుతం విజయ్ ఆంటోనీ నటించిన 'మార్గాన్' మూవీ త్వరలోనే విడుదలకానుంది. ఆ తర్వాత 'శక్తి తిరుమగన్', 'లాయర్' వంటి చిత్రాల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాల తర్వాత శశి దర్శకత్వంలో విజయ్ ఆంటోనీ నటించనున్నారు. ఈ సినిమాకు విజయ్ ఆంటోనీ సంగీతం సమకూర్చనున్నారు. అలాగే, హీరోయిన్, ఇతర నటీనటుల ఎంపిక జరగాల్సివుంది.





ప్రాజెక్టును ప్రారంభిస్తున్న ప్రముఖులు

వెల్లక్కల్ సరస్సు పునరుద్ధరణ

● బ్లూ-గ్రీన్ ఎకోలాజికల్ ఫారెస్ట్ ప్రారంభం

చెన్నై, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం మేడవాక్కంలోని వెల్లక్కల్ పెద్ద సరస్సును పునరుద్ధరించగా, బ్లూ-గ్రీన్ ఎకోలాజికల్ ఫారెస్ట్ ప్రారంభోత్సవం జరిగింది. 2014 నుంచి సామాజిక కార్యకర్తలు, స్థానికులు ఈ సరస్సును పునరుద్ధరించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టును మేడవాక్కం పంచాయతీ అధ్యక్షుడు శివభూషణం రవి, యూనియన్ కౌన్సిలర్, మేడవాక్కం పంచాయతీ మాజీ అధ్యక్షుడు బి.రవి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటుడు ఆర్య, 3233 జిల్లా రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ మహావీర్ బోత్రా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బ్లూ-గ్రీన్ ఎకోలాజికల్ ఫారెస్ట్‌ను స్థాపించేందుకు 3 వేలకు పైగా మొక్కలు నాటుతున్నారు. ఈ ప్రాజెక్టుల కోసం రోటరీ క్లబ్‌లు రూ.25 లక్షలు విరాళం ఇచ్చాయి. ఈ సందర్భంగా చెన్నై క్యాపిటల్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఆర్‌టీఎస్ హేమంత్ ఖండేల్వాల్ మాట్లాడుతూ.. సమాజం దీర్ఘకాలిక స్థిరత్వం, శ్రేయస్సుకు తోడ్పడడం తమకు గర్వంగా వుందన్నారు.

వైభవంగా తుళుకానత్తమ్మ ఆలయ మహాకుంభాభిషేకం



ఆలయ గోపుర కలశాలకు కుంభాభిషేకం నిర్వహిస్తున్న పూజారులు

ప్యారీస్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక నుంగంబాక్కం పొన్నాంగిపురంలో 1879వ సం వత్సరంలో నిర్మించిన ఆది తుళుకానత్తమ్మ ఆలయ మహాకుంభాభిషేకం గురువారం వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్త అరుణాచలం పర్యవేక్షణలో ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యాగశాలలో సోమవా రం నుంచి హోమాలు,ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంభాభిషేకం సందర్భంగా అమ్మవారు, పరివార మూర్తులను అలంకరించి దీపారాధన చేశారు. కుంభాభిషేకానికి తరలివచ్చిన భక్తుల సమక్షంలో ఆలయ గోపురం, దేవతా మూర్తులు కొలువైన సన్నిధులకు పవిత్ర జలాలతో మహాకుంభాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులందరికీ తీర్థ అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఒకప్పుడు కంచిపీఠాధిపతి మహాస్వామి, మాజీముఖ్యమంత్రి కామరాజర్, మాజీ గవర్నర్ ప్రభుదాస్ పట్వారీ, నడిగర్ తిలగం శివాజీ గణేశన్ తదితర ప్రముఖులు ఈ ఆలయానికి వచ్చి అమ్మవారిని సేవించడం గమనార్హం.



ఆలయ రాజగోపురం



ఆలయ అంతర ప్రాకారం

తిరువారూరు జిల్లా నీడామంగళం సమీపంలో కోవిల్ వెన్ని అనే గ్రామంలోని వెన్నికరుంబేశ్వరాలయం మధుమేహ రోగులను ఆ వ్యాధి నుండి విముక్తి కలిగించే అపూర్వమైన శైవక్షేత్రంగా భాసిల్లుతోంది. ఆ ఆలయంలో చీమలకు చక్కెర, రవ్వ మిశ్రమాన్ని ఆహారంగా పెడితే నెలలోపే మధుమేహం తగ్గుముఖం పడుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అందుకు తగ్గట్లే ఆలయంలోని మూలవిరాట్టు చెరకు గడల బంధనంలో దర్శనమిస్తున్నారు. ఇక్కడి స్వామివారు నాలుగు యుగాల్లోనూ పూజలందుకున్నారని స్థలపురాణం చెబుతోంది. అంతేకాకుండా శైవ నయన్మార్లలో అప్పర్, సంబంధర్ తమ కీర్తనల్లో ఈ క్షేత్ర మహిమను కీర్తించారు. ఆలయం చిన్నదే అయినా కీర్తి మాత్రం అపారం.

- టి.నగర్, ఆంధ్రజ్యోతి

చిన్న ఆలయం.. కీర్తి అపారం

ఆధ్యాత్మికం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

● చక్కెర వ్యాధి పరిహార క్షేత్రం వెన్నికరుంబేశ్వరాలయం
● నాలుగు యుగాల్లో పూజలందుకుంటున్న పరమేశ్వరుడు

స్వామివారి నామధేయం : వెన్నికరుంబేశ్వరుడు (త్రయంబకేశ్వరుడు, రసపురీశ్వరుడు, వెన్ని నాథుడు)
అమ్మవారి నామధేయం ! అళగియ నాయకి (సౌందర్య నాయకి)
స్థలవృక్షం : నందివర్ధనం, తీర్థం : సూర్య తీర్థం, చంద్రతీర్థం
ఈ క్షేత్రం పౌరాణిక నామధేయం : తిరువెన్నియూరు, కోయిల్ వెన్ని

ఆలయ వైభవం...

ఈ ఆలయం తూర్పుదిశగా నిర్మించారు. ఆలయం ఎదుట సూర్యతీర్థం, మూడంతస్థుల రాజగోపురం, ఆలయ ప్రవేశద్వారం దాటిన తరువాత నంది, బలి పీఠం ఉన్నాయి. ప్రాకారంలో వినాయకుడు, మురుగన్, గజలక్ష్మి, భైరవుడు, నవగ్రహాల సన్నిధులున్నాయి. గోష్ఠమూర్తులుగా నర్తన వినాయకుడు, దక్షిణామూర్తి, లింగోద్భవుడు, దుర్గాదేవి దర్శనమిస్తారు. గర్భాలయం కందకం ఆకారంలో ఉంటుంది. ఆలయంలో ఓ చెట్టు దిగువ కరికాళచోళుడు ఆరాధించిన పిడారి అమ్మవారున్నారు. అక్కడికి కాస్త దూరంలోనే తీర్థకొలను ఉంది. గర్భాలయ మండపంలోనే దక్షిణాభిముఖంగా సౌందర్యనాయకి అమ్మవారు దర్శనమిస్తున్నారు. స్వామి అమ్మవార్ల సన్నిధులకు మధ్య నటరాజసభ ఉంది. ఇక్కడి అమ్మవారికి గాజులు వేసి మహిళలు పూజించడం ఆనవాయితీ. ఆలయంలో ఒకే ఒక వెలుపలి ప్రాకారం ఉంది. ఆలయంలో పడమటి మండపంలో కన్నిమూల గణపతి, వళ్ళిదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, గజలక్ష్మి సన్నిధులు న్నాయి. ఆలయ ఈశాన్య దిశలో భైరవుడు, నవగ్రహాలు కూడా దర్శనమిస్తాయి. రాజరాజచోళుడు, కులోత్తుంగ చోళుడి శిలాశాసనాలు కూడా ఉన్నాయి.

అత్యంత ప్రాచీనమైన ఈ క్షేత్రంలో స్వామివారు నాలుగు యుగాల్లోనూ భక్తులను అనుగ్రహిస్తున్నారని స్థలపురాణం. మూలవిరాట్టు తిరుమేనిలో (పాణంలో) చెరకుగడలతో కట్టిపడేసినట్లు కనిపిస్తుండటం విశేషం. సంగకాలంలో ఇక్కడ వెన్నికుయత్తియార్ అనే మహాపండితుడు అవతరించాడని, ఆ పండితుడు రచించిన 'పురనానూరు' పాటలతో కరికాళచోళుడు చేసిన వెన్నిపోరు (వెన్ని యుద్ధం) విశేషాల ప్రస్తావన ఉంది. కరికాళచోలుడు తన 18వ యేట ఇక్కడ ఉన్న పిడారి అమ్మవారినిని అనునిత్యం ఆరాధించి చేర, పాండ్య రాజులపై దండెత్తి యుద్ధంలో విజయం సాధించాడు. కరికాళ చోళుడు చేసిన విజయపరంపరలో ఈ గెలుపే అత్యంత ప్రధానమైనదంటూ ఇక్కడ శిలాశాసనం కూడా ఉంది. ఇక ఇక్కడి పిడారి అమ్మవారిని దర్శించుకుంటే శత్రుభయం ఉండదనేది ఐతిహ్యం. ఇక కరికాళచోళుడు, ముసుకుంద చక్రవర్తి పోరులో గెలుపొందినందుకు విజయోత్సవాలు జరుపుకోవటమే కాకుండా తమకు అండగా నిలిచిన కరుంబేశ్వరాలయ జీర్ణోద్ధరణ కూడా జరిపించినట్లు స్థలపురాణం.



ఆలయ కుడ్యంపై విఘ్నేశ్వరుడు

మధుమేహ పీడితులకు ఉపశమనం..

మధుమేహంతో బాధపడుతున్న రోగులు ఈ ఆలయాన్ని దర్శించుకుని చక్కెర, రవ్వను సమపాళ్ళలో కలిపి ప్రాకారాన్ని ప్రదక్షిణ చేసిన తర్వాత ఆలయ అంతర ప్రాకారంలో చీమలకు ఆహారంగా పెడతారు. చీమలకు ఈ రీతిలో ఆహారం అందించటం వల్ల రోగులను దీర్ఘకాలంగా పట్టిపీడిస్తున్న మధుమేహం క్రమంగా తగ్గుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. మధుమేహం తగ్గుముఖం పట్టగానే భక్తులు మళ్ళీ ఈ ఆలయాన్ని దర్శించుకుని కరుంబేశ్వరర్ స్వామివారికి చక్కెర పొంగలి నైవేద్యంగా సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది.

స్థలపురాణం..

ఈ ఆలయం ఉన్న ప్రాంతం పూర్వ చెరకుతోటలతో మహావనంగా ఉండేది. ఓ పర్యాయం ఇద్దరు మునీశ్వర్లు తీర్థయాత్రలో భాగగా ఈ క్షేత్రానికి విచ్చేశారు. చెరకు వనంలో స్వయంభువుగా వెలసిన పరమేశ్వరుడిని ఆరాధించారు. ఆ తర్వాత ఈ క్షేత్రానికి స్థల వృక్షం చెరకు మొక్క అని, వెన్ని అని పిలువబడుతున్న నందివర్ధనమే స్థల వృక్షమని ఆ మునీశ్వరులిరువురూ వాదులాడుకున్నారు. పరమేశ్వరుడు అశరీర వాణిగా తన నామధేయంలో చెరకు (తమిళంలో 'కరుంబు'), నందివర్ధన స్థల వృక్షంగా ఉంటుందని ప్రకటించారు. ఆ నాటి నుండి ఇక్కడి పరమేశ్వరుడిని 'కరుంబేశ్వరర్' అని పిలుస్తున్నారు. ఆ తమిళ నామధేయమే సంస్కృతంలో 'రసపురీశ్వరుడిగా మారింది. ఇక ఈ ఆలయ స్థలవృక్షం పేరుతోనే ఈ ఊరికి 'వెన్నియూరు' అనే పేరు సార్థకమైంది. కాలగమనంలో ఆ పేరు కూడా 'కోయిల్ వెన్ని'గా మారింది.

ఆలయ విశేషాలు...

తమిళ మాసమైన పంగుణి నెల 2, 3, 4 తేదీల్లో గర్భాలయంలోని కరుంబేశ్వరుడిపై సూర్యకిరణాలు ప్రసరిస్తాయి. ఆ వేడుకలను సూర్యపూజోత్సవంగా జరుపుకుంటున్నారు. ఈ ఆలయంలో నవరాత్రి వేడుకలు, పంగుణి ఉత్తిరం, చిత్రాపౌర్ణమి, వైకాశి విశాఖం, ఆనితిరుమంజనం, కార్తీకదీపోత్సవం, ఆరుద్ర దర్శనం, తైపూసం. మాసిమఖం ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి.

ఎలా వెళ్ళాలి?...

తిరువారూరు జిల్లా నీడామంగళం సమీపంలో కోవిల్ వెన్ని అనే గ్రామంలో ఈ ఆలయం ఉంది. తిరువారూరు వెళ్లడానికి చెన్నై సహా పలు నగరాల నుంచి రాష్ట్ర రవాణా సంస్థ బస్సులు, ప్రైవేటు బస్సులు నడుస్తున్నాయి. తిరువారూరు నుంచి టౌన్ బస్సులు, టాక్సీల్లో ఆలయానికి చేరుకోవచ్చు. ఈ ఆలయం నీడామంగళానికి 8 కి.మీ.లు, హరిద్వారమంగళం నుంచి 13 కి.మీ.లు, మన్నార్గుడి నుంచి 20 కి.మీ.లు, తిరువారూరు నుండి 36 కి.మీల దూరంలో ఉంది. తిరువారూరు - తంజావూరు రహదారిలో ఉన్న ఈ. ఆలయాన్ని రోజూ ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 5 నుండి రాత్రి 8 వరకు తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.



కన్నిమూల గణపతి, గజలక్ష్మి

చెన్నై ఐఐటీలో చేరిన గిరిజన విద్యార్థిని



రాజేశ్వరి

చెన్నై, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జేఈఈలో ఉత్తీర్ణత సాధించి చెన్నై ఐఐటీలో చేరిన సేలం జిల్లాకు చెందిన గిరిజన విద్యార్థిని రాజేశ్వరిని పలువురు ప్రముఖులు అభినందించారు. రాజేశ్వరి విద్యాఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని ముఖ్యమంత్రి స్టాలిన్ గురువారం ప్రకటించారు. సేలం జిల్లా కల్వరాయల్‌మలై కరుమందూరు గ్రామంలో గిరిజన వర్గానికి చెందిన ఆండి, కవిత దంపతుల రెండో కుమార్తె రాజేశ్వరి 1వ తరగతి నుండి 8వరకు కరుమందురైలోని ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలలో చదువుకుంది. 9నుండి ప్లస్‌టూ వరకు అక్కడున్న ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుకుంది. పదో తరగతి పబ్లిక్ పరీక్షలో 500లకు 438 మార్కులు, ప్లస్‌టూ పరీక్షలో 600లకు 521 మార్కులు సాధించి ఉత్తీర్ణురాలైంది. ఆ తర్వాత కెమిస్ట్రీ డిగ్రీ పుచ్చుకున్న ఈమె తండ్రి మరణించడంతో కుటుంబాన్ని పోషించుకునే బాధ్యతలు చేపట్టి, చెన్నైలోని ఓ ప్రైవేటు కంపెనీలో చేరి పనిచేస్తున్నారు. తన తండ్రి కల సాకారం చేసేలా, విద్యారంగంలో ప్రత్యేక దృష్టిసారించిన రాజేశ్వరికి చెన్నై ఐఐటీలో చదువుకునే అవకాశం దక్కింది. ముఖ్యమంత్రి స్టాలిన్, ప్రధాన ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిస్వామితో పాటు పలువురు ప్రముఖులు ఆమెను అభినందించగా, విద్యాఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది.



గురువారం రిప్పన్‌భవనంలో మేయర్ ఆర్ ప్రియను మర్యాదపూర్వకంగా కలుసుకున్న థాయ్‌లాండ్ డిప్యూటీ రాయబారి రచ్చా అరిబర్గ్



నుంగంబాక్కంలోని మదర్ థెరిస్సా మహిళా ప్రాంగణంలో రాష్ట్ర మహిళాభివృద్ధి సంస్థలో కొత్త ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్న రాష్ట్ర సమాచార హక్కుల సంస్థ కమిషనర్ ఎం.సెల్వరాజ్



షోళింగనల్లూరు ఎల్కాట్ ఐటీ పార్కులో ప్రపంచ పర్యావరణ దినం సందర్భంగా అపోలో క్యాన్సర్ సెంటర్స్ (ఏసీసీ), అపోలో ప్రోటాన్ క్యాన్సర్ సంయుక్త ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న ఏసీసీ సీఈఓ కరణ్ పూరి, డాక్టర్ సెంథిల్ కుమార్ గణపతి, డాక్టర్ జయచంద్రన్, డాక్టర్ హేమలత తదితరులు

3 వేల ఆలయాలకు కుంభాభిషేకాలు

● మా పాలన మెచ్చుకుంటున్న భక్తులు
● సీఎం స్టాలిన్ ప్రకటన





ఆలయ సంప్రోక్షణ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు పీకే శేఖర్‌బాబు

చెన్నై,జూన్5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డీఎంకే ద్రావిడ తరహా పాలనను భక్తులంతా మెచ్చుకుంటుండగా, అల్పులు అదే పనిగా విమర్శలు చేస్తున్నారని ఆ పార్టీ అధ్యక్షుడు,రాష్ట్ర ముఖ్యమంత్రి పేర్కొన్నారు. నాగపట్టినం జిల్లా తిరుపుగళూరు వేలకురిచ్చి ఆధీనం ఆధ్వర్యంలోని కరుత్తాయ్‌కుళలి అంబాల్, అగ్నీశ్వరాలయ కుంభాభిషేకం గురువారం ఉదయం జరిగింది. దీంతో డీఎంకే అధికారంలోకి వచ్చాక గత నాలుగేళ్లలో దేవాదాయ శాఖ నిర్వహించిన ఆలయ కుంభాభిషేకాల సంఖ్య మూడు వేలకు చేరింది. ఈ కుంభాభిషేక వేడుకల్లో దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు, పాఠశాలల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ పాల్గొన్నారు.ఈ విషయమై స్టాలిన్ తన ఎక్స్‌పేజీలో ఓ సందేశాన్ని పోస్టు చేశారు. అందరికీ అన్ని సదుపాయాలు అనే ఏకైక లక్ష్యంతో నాలుగేళ్ళ పాలనలో తమ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. రాష్ట్రంలో మూడు వేల ఆలయాలకు కుంభాభిషేకాలు నిర్వహించడం సులువైన పనికాదని, అధికారులం సమష్టి కృషి వలనే ఇది సాధ్యమైందని చెప్పారు.ఇంతవరకూ ఏ ప్రభుత్వమూ ఇంత తక్కువ వ్యవధిలో మూడు వేల ఆలయాలకు కుంభాభిషేకాలు నిర్వహించలేదన్నారు.ఇక కుంభాభిషేకం జరుగుతున్న ఆలయం వద్ద మీడియాతో మంత్రి శేఖర్ బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకే తాము ఆలయాలను కొత్త మెరుగులతో తీర్చిదిద్దుతున్నామని చెప్పారు..

తేనిలో జీఆర్టీ షోరూం ప్రారంభం



ప్యారీస్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పడుతూ తమ కస్టమర్లను తృప్తి కలిగించేలా ఆభరణాలు తయారీలో పేరిన్నికగన్న జీఆర్టీ జ్యూవెలర్స్ తన 65వ షోరూంను తేని నగరంలో అట్టహాసంగా ప్రారంభించింది. 1964వ సంవత్సరంలో ప్రారంభమైన జీఆర్టీ జ్యూవలర్స్ నాణ్యత, మన్నిక, సరసమైన ధరలకు బంగారు, వెండి ఆభరణాలు తయారుచేసి కస్టమర్లను సంతృప్తి పరుస్తోంది. భారతదేశం, సింగపూర్‌లలో 64 షోరూంలు కలిగిన ఈ సంస్థ తన 65 షోరూంను తేనిలోని మదురై మెయిన్ రోడ్డు కెనరా బ్యాంకు సమీపంలో గురువారం ప్రారంభించింది. ఈ షోరూంలో బంగారం, వెండి, వజ్రాలు, ప్లాటినం, రత్నాలు పొదిగిన నగలను అందుబాటులో ఉంచారు.

రేపటి నుంచి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు

తిరుచానూరు అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు శనివారం నుంచి ఐదు రోజుల పాటు ఘనంగా జరగనున్నాయి. మొదటి రోజు శనివారం రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణ స్వామి, రెండవ రోజు సుందరరాజస్వామి, మిగిలిన మూడు రోజుల పద్మావతి అమ్మవారు తెప్పలపై విహరిస్తారు. రాత్రి 7.30గంటలపై ఊరేగే ఉత్సవర్లు తిరుమాడవీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షిస్తారు. 10వ తేదీ రాత్రి 8.30గంటలకు అమ్మవారి గజవాహనసేవ, 11న అమ్మవారు గరుడ వాహనంపై ఊరేగి భక్తులకు అభయమివ్వనున్నారు. తెప్పత్సోవాలను పురస్కరించుకుని ఆలయంలో ఐదు రోజుల పాటు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కాగా తెప్పోత్సవాలను పురస్కరించుకుని పద్మసరోవరంలో ఇంజనీరింగ్ అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. - తిరుచానూరు, ఆంధ్రజ్యోతి



అమ్మవారి పుష్కరణితో తెప్పలను ట్రయల్ రన్ నిర్వహిస్తున్న దృశ్యం


శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల, జూన్5(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.67 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 78,288

తలనీలాలు సమర్పించినవారు: 32,079



అమ్మ ముఖంలో ఆనందం



బయటి నుంచి కొనుగోలు చేసిన బేబీ బెడ్స్‌లో పురిటి బిడ్డలను ఆస్పత్రి నుంచి తీసుకువెళుతున్న తల్లులు

పంపిణీకి సిద్ధం చేస్తున్న బేబీ కిట్లు



పసికందుల సంరక్షణకు ప్రభుత్వం శ్రీకారం

ఎన్టీఆర్ బేబీ కిట్ల పునరుద్ధరణకు ఏర్పాట్లు


ఎన్టీఆర్ బేబీ కిట్ల పథకాన్ని పునరుద్ధరించాలనే నిర్ణయం పేదతల్లుల్లో ఆనందాన్ని నింపనుంది. ప్రసవానికి ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చేవారిలో ఎక్కువమంది పేదవారే. ప్రసవానంతరం రూ.500 ఖర్చు పెట్టి పసికందును తీసుకువెళ్లలేని దైన్యస్థితిని ఎదుర్కొనేవారే. ఈ పరిస్థితిని గుర్తించిన టీడీపీ ప్రభుత్వం గతంలో ఎన్టీఆర్ బేబీ కిట్లను ఉచితంగా అందించేది. ఈ బేబీ కిట్ విలువ కనీసం రూ.1,500 వరకు ఉండేది. ఇందులో బేబీ టవల్, బెడ్, లిక్విడ్ సోప్, దోమ తెర ఉండేవి. పురిటి బిడ్డల సంరక్షణకు ఇవి ఉపయోగపడేవి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించేందుకూ పరోక్షంగా దోహదపడేది.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

ఆ ఐదేళ్లూ కిట్లు ఇస్తే ఒట్టు

2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఈ పథకం పేరు మార్చింది గానీ కిట్లను మాత్రం అందించలేకపోయింది ఏడాదిలోనే పూర్తిగా స్వస్తి పలికేసింది. దీంతో ఆస్పత్రుల్లో ప్రసవాలు చేసుకున్న తల్లులు ఇబ్బందిపడేవారు. ప్రసవానంతరం కొందరు పాత దుప్పట్లను ఉపయోగించే వారు. దీనివలన పిల్లలు ఇన్‌ఫెక్షన్ల బారినపడే అవకాశాలుండేవి. ఈక్రమంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ఎన్టీఆర్ బేబీ కిట్ల పథకాన్ని పునరుద్ధరించాలని నిర్ణయించింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 102 పీహెచ్‌సీలు, 16 సీహెచ్‌సీలు, నాలుగు ఏరియా ఆస్పత్రులు, రెండు జిల్లా ఆస్పత్రుల పరిధిలో ఏటా 40 వేలకు పైగా ప్రసవాలు జరుగుతాయి. తిరుపతిలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలోనే ఏటా దాదాపు 20 వేలకు పైగా ప్రసవాలు జరుగుతాయి. ఈ క్రమంలో ప్రభుత్వం ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ఎన్టీఆర్ బేబీ కిట్లకు ఏటా రూ.6 కోట్లను ఖర్చు చేయనుంది. ఈదిశగా ఇప్పటికే చర్యలను వేగవంతం చేసింది. త్వరలోనే బేబీకిట్లు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తిరుపతి ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారథి తెలిపారు.

కల్పవృక్షంపై గోవిందుడి విహారం





తిరుపతిఅర్బన్, జూన్5(ఆంధ్రజ్యోతి): గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం స్వామివారు కల్పవృక్ష వాహనంపై విహరించి భక్తులను కటాక్షించారు. వాహనం ముందు గజరాజులు ఠీవిగా నడుస్తుండగా..భక్తజన బృందాల కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు పట్టి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం 10-11గంటల వరకు స్వామి. అమ్మవార్లకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, పలు రకాల పండ్ల రసాలతో అభిషేకం చేశారు. రాత్రి 7-9గంటల వరకు సర్వభూపాల వాహనంపై స్వామివారు భక్తులకు అభయమిచ్చారు. కాగా శుక్రవారం రాత్రి 7-10గంటల వరకు స్వామివారి గరుడ సేవ జరగనుంది.

కులశేఖరపట్టణంలో శరవేగంగా

రాకెట్ లాంచ్ ప్యాడ్ నిర్మాణాలు

పెరంబూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కులశేఖరపట్టణంలో 2,233 ఎకరాల్లో ఏర్పాటుకానున్న రాకెట్ లాంచ్ ప్యాడ్ నిర్మాణపనులు శరవేగంగా జరుగుతున్నాయి. భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో)కు ఆంధ్ర రాష్ట్రం శ్రీహరికోటలో ఉన్న సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లో రాకెట్ లాంచ్ ప్యాడ్ ఉంది. తదుపరి తూత్తుకుడి జిల్లా కులశేఖరపట్టణంలో రాకెట్ లాంచ్ పాడ్ నిర్మాణానికి 2,233 ఎకరాల భూసేకరణ చేయగా, గత ఏడాది ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. కులశేఖరపట్టణంలో లాంచ్ ప్యాడ్‌కు శంకుస్థాపన జరిగే సమయంలో, రోహిణి రాకెట్‌ను అంతరిక్షంలోకి పంపుతామని ఇస్రో ప్రకటించింది. ఆ ప్రకారం, కులశేఖరపట్టణం లాంచ్ ప్యాడ్ నుంచి వాతావరణం పరిశోధనకు రోహిణి 6హెచ్200 చిన్న రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించారు. ఆ రాకెట్ 75.24 కి.మీ ఎత్తుకు చేరుకుని 121.42 కి.మీ ప్రయాణించి సముద్రంలో పడింది. ఈ నేపథ్యంలో, కొద్ది నెలల క్రితం కులశేఖరపట్టణంలో లాంచ్ ప్యాడ్ ఏర్పాటుకు భూమి పూజ జరిగింది. అనంతరం సేకరించిన 2,233 ఎకరాల విస్తీర్ణం కలిగిన స్థలం చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టారు. అలాగే, 10కి పైగా ప్రాంతాల్లో భవన నిర్మాణపనులు జరుగుతున్నాయి. అదే సమయంలో రాకెట్ లాంచ్ పాడ్ కోసం ఎంపిక చేసిన స్థలంలోని ఇసుక దిబ్బలు తొలగించి పునాదులు వేస్తున్నారు. వచ్చే ఏడాది ఇక్కడి నుంచి చిన్నరకం రాకెట్‌లు ప్రయోగించేలా పనులు ముమ్మరం చేసినట్లు అధికారులు తెలిపారు.



రాకెట్ లాంచ్ ప్యాడ్ నిర్మాణ పనులు

శ్రీసిటీలో ఘనంగా పర్యావరణ దినోత్సవం

- మొండలైజ్, బెర్జిన్ పైప్స్ పరిశ్రమల్లో సోలార్‌ప్లాంట్ల ప్రారంభం

వరదయ్యపాళెం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పర్యావరణ హిత ప్రమాణాలతో సుస్థిర అభివృద్ధి దిశగా పయనిస్తున్న శ్రీసిటీలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు తిరుపతి జోనల్ కార్యాలయ సీనియర్ పర్యావరణ ఇంజనీర్ ఎస్ఎస్ మురళి విచ్చేసి స్థానిక ఎలక్ట్రానిక్ మ్యానుఫాక్చరింగ్ క్లస్టర్‌లో మియావాకి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. శ్రీసిటీ చేపట్టిన పర్యావరణ హిత చర్యలను అభినందించారు. శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ రెడ్యూస్, రియూజ్ రీసైకిల్ (3ఆర్) విధానం పర్యావరణ పరిరక్షణకు ఎంతో అనువైందన్నారు. శ్రీసిటీలో సుస్థిరిత, కాలుష్య నివారణ, వ్యర్థ పదార్థాల నిర్వహణకు పై విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు గ్రీన్ అండ్ క్లీన్ కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రవీంద్ర సన్నారెడ్డితో కలిసి మొండలైజ్ పైప్స్ పరిశ్రమల సప్లై వైస్ ప్రెసిడెంట్ వెంకట్ వేనేపల్లి, బెర్జిన్ సోలార్ యూనిట్ హిల్ అండ్ స్మిత్ హోల్డింగ్స్ సీఈవో రట్గర్ ఆల్‌బర్ట్‌లు 350 కిలోవాట్ల సోలార్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ ఉద్యానశాఖ విభాగాధికారి మధుసూదన్‌రెడ్డి, ఏపీపీసీబీ పర్యావరణ ఇంజనీర్ సుధీర్, శ్రీసిటీ పర్యావరణ ఇంజనీర్ వెంకట్, సత్యవేడు అటవీశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మొండలైజ్‌లో సోలార్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న రవీంద్ర సన్నారెడ్డి, వెంకట్, రట్గర్ ఆల్‌బర్ట్ తదితరులు

రూ.566 కోట్లతో

కురళగం భవనం పునరుద్ధరణ

- బ్రిడ్జ్ అండ్ రూఫ్ ఇండియాతో ఒప్పందం

ప్యారీస్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరంలో బ్రాడ్‌వే ప్రాంతంలో ప్రభుత్వ నిర్వహణలోవున్న కురళగం భవనాన్ని పునరుద్ధరించి, మల్టీమోడల్ ఫెసిలిటీ కాంప్లెక్స్ (ఎంఎంఎఫ్‌సీ) నిర్మించేందుకు చెన్నై మెట్రోరైల్వే లిమిటెడ్ (సీఎంఆర్ఎల్), రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి సంస్థ సంయుక్తంగా ప్రణాళిక రూపొందించాయి. రూ.566.59 కోట్లతో రూపొందించిన ఈ భారీ ప్రాజెక్టును బ్రిడ్జ్ అండ్ రూఫ్ ఇండియా సంస్థకు అప్పగించారు. సీఎంఆర్ఎల్, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి సంస్థలు సంయుక్తంగా చెన్నై మెట్రో ఆర్థిక వ్యవహారాల నిర్వహణ సంస్థ పేరిట ప్రారంభించిన సంస్థ ఛైర్మన్ ఎంఏ సిద్ధిఖ్ సమక్షంలో ఆ సంస్థ డైరెక్టర్ అర్జున్, బ్రిడ్జి అండ్ రూఫ్ ఇండియా ప్రధానకార్యదర్శి సంజయ్ భట్టాచార్య నగరంలో బుధవారం ఏర్పాటు చేసిన ఒప్పంద కార్యక్రమంలో పాల్గొని, సంతకాలు చేసిన పత్రాలు మార్చుకున్నారు.



ఒప్పందపత్రాలతో నిర్వాహకులు

32 డ్రైవర్ రహిత మెట్రోరైళ్ల తయారీ...

చెన్నై మెట్రోరైల్వే లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) రెండో విడత పథకంలో 32 డ్రైవర్ రహిత మెట్రోరైళ్ల తయారీకి రూ.1,538.35 కోట్లతో ప్రణాళిక రూపొందించింది. ఈ కొత్త పథకంలో మూడు రైలు బోగీలు కలిగిన 32 మెట్రోరైళ్ల తయారీకి సంబంధించి అల్‌స్ట్రోమ్ ట్రాన్స్‌పోర్టు ఇండియాతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు సీఎంఆర్ఎల్ అధికారులు తెలిపారు. గురువారం జరిగిన కార్యక్రమంలో సీఎంఆర్ఎల్ తరుఫున డైరెక్టర్ మనోజ్ గోయల్, అల్‌స్ట్రోమ్ డైరెక్టర్ పరార్ నందలాల్ ఒప్పందపత్రాలు మార్చుకున్నారు. కార్యక్రమంలో సీఎంఆర్ఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఏఆర్ రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు. ఈ ఒప్పందంలో రైలు బోగీల డిజైనింగ్, ఉత్పత్తి, సరఫరా, ఉద్యోగులకు శిక్షణ, మెట్రోరైలు, డిపోలకు 15ఏళ్ల వరకు డ్రైవర్ రహిత మెట్రోరైళ్ల పంపిణీ చేయడం వంటి అంశాలు చోటుచేసుకున్నాయి.

స్టూడెంట్ కిట్స్ గతంకంటే నాణ్యంగా ఉన్నాయి

- కిట్స్ స్టాక్ పాయింట్లను పరిశీలించిన రాష్ట్ర పరిశీలకులు అనురాధ

తిరుపతి(విద్య), జూన్ 5(ఆంధ్రజ్యోతి): స్టూడెంట్ కిట్స్ గత ఏడాదికంటే నాణ్యంగా ఉన్నాయని రాష్ట్ర పరిశీలకులు, అమరావతి సమగ్ర శిక్ష డిప్యూటీ డైరెక్టర్ అనురాధ పేర్కొన్నారు. గురువారం ఆమె చంద్రగిరి, రేణిగుంట, తిరుపతి రూరల్, అర్బన్, ఏర్పేడు ప్రాంతాల్లోని స్టూడెంట్ కిట్స్ స్టాక్ పాయింట్లను పరిశీలించారు. టెక్స్, నోట్ పుస్తకాలు, వర్క్‌బుక్స్, పిక్టోరియల్ డిక్షనరీ, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, బ్యాగ్, బెల్ట్, షూస్, మూడు జతల యూనిఫాం క్లాత్ నాణ్యతను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ షూలు, యూనిఫాం తప్ప మిగిలిన అన్ని వస్తువులు ఇప్పటికే పాఠశాలలకు చేరాయని చెప్పారు. అనంతరం తిరుపతి అర్బన్ మండలంలో జరుగుతున్న సీసీహెచ్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలు చేశారు. సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గౌరీశంకర్, కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ సురేష్, మండల విద్యాశాఖ అధికారులు, సీఆర్పీలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



బ్యాగ్స్ నాణ్యతను పరిశీలిస్తున్న అనురాధ

రామచంద్రాపురం ఎంపీడీవోకు పదోన్నతి

తిరుపతి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం ఎంపీడీవో బి.ఇందిరమ్మకు ప్రభుత్వం డీఎల్‌డీవో (డివిజినల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్)గా పదోన్నతి కల్పించింది. వాస్తవానికి ఆమెకు 2021-22లోనే ఈ పదోన్నతి లభించింది. అయితే ఇందిరమ్మతో సహా రాష్ట్రవ్యాప్తంగా ముగ్గురు ఎంపీడీవోలకు అప్పట్లో డీఎల్‌డీవో పోస్టులు ఇవ్వకుండా ప్రభుత్వం పెండింగులో ఉంచింది. ఈ ముగ్గురిపై శాఖాపరమైన విచారణ పెండింగులో ఉండడం వల్ల ప్రభుత్వం ఆ మేరకు నిర్ణయం తీసుకుంది. అయితే తదుపరి విచారణలో ఈ ముగ్గురిపై వచ్చిన ఆరోపణలు నిరూపణ కాకపోవడంతో పదోన్నతికి అడ్డంకులు తొలగిపోయాయి. ఆ క్రమంలో ప్రభుత్వం ఇందిరమ్మ సహా ముగ్గురికీ డీఎల్‌డీవోగా పదోన్నతి కల్పిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ పదోన్నతి తాత్కాలిక ప్రాతిపదికన చేపడుతున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. పోస్టింగ్ కోసం పీఆర్ శాఖ ముఖ్య కార్యదర్శికి రిపోర్టు చేయాలని ఆదేశించింది.

తిరుమలకు మెరుగైన భద్రత

- టీటీడీ నూతన సీవీఎస్వో మురళీకృష్ణ

తిరుమల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గతంలో డీఎస్పీగా, అదనపు ఎస్పీగా పని చేసిన అనుభవాన్ని ఉపయోగించుకుని భక్తులకు, తిరుమల క్షేత్రానికి మెరుగైన భద్రతను కల్పించేలా విధులు నిర్వహిస్తానని టీటీడీ నూతన సీవీఎస్వోగా కేవీ మురళీకృష్ణ తెలిపారు. తిరుమల శ్రీవారి ఆలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించిన ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల టీటీడీ తీసుకున్న నిర్ణయాలను అర్థం చేసుకుని భద్రత పెంపుకోసం చర్యలు తీసుకుంటామన్నారు. టెక్నాలజీని కూడా వినియోగించుకుని ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తామన్నారు. ఇంత బాధ్యతాయుతమైన ఉద్యోగాన్ని నిర్వర్తించేందుకు అవకాశం కల్పించిన స్వామివారితో పాటు సీఎం, డిప్యూటీ సీఎం, సీఎస్, డీజీపీకి ధన్యవాదాలు తెలిపారు.



శ్రీవారి ఆలయంలో ధ్వజస్తంభానికి మొక్కుతున్న మురళీకృష్ణ

నేటినుంచి డీఎస్సీ పరీక్షలు

- జిల్లాలో 4, చెన్నైలో 4 కేంద్రాలు
- గ్రీవెన్స్ సెల్ నెంబరు 90321 85001

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఏపీ మెగా డీఎస్సీ పరీక్షలు శుక్రవారం నుంచి జరగనున్నాయని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. గురువారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టరేట్ నుంచి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈనెల 30వ తేదీ వరకు జరగనున్న ఈ పరీక్షలకు జిల్లాకు సంబంధించి ఎనిమిది పరీక్ష కేంద్రాలు మంజూరయ్యాయని చెప్పారు. వీటిల్లో చిత్తూరు జిల్లాలో నాలుగు, చెన్నైలో నాలుగు ఉన్నాయన్నారు. జిల్లాలో 22,046 మంది, చెన్నైలో 1484 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు వివరించారు. సందేహాలు, ఫిర్యాదులు, సలహాలకు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ సెల్ నెంబరు 90321 85001 ఏర్పాటు చేశామన్నారు.

చిత్తూరు జిల్లాలో పరీక్ష కేంద్రాలు

- శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ (సీటమ్స్), మురకంబట్టు, చిత్తూరు.
- శ్రీవేంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ (ఎస్వీసెట్), ఆర్వీఎస్ నగర్, చిత్తూరు.
- వేము ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, పి.కొత్తకోట, చిత్తూరు - తిరుపతి హైవే, చిత్తూరు.
- మదర్‌థెరిస్సా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, పలమనేరు.

చెన్నైలో పరీక్ష కేంద్రాలు

- బ్లూ లోటస్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్, నెహ్రూ నగర్, ఓఎంఆర్ రోడ్, చెన్నై, టి.ఎన్- 600041.
- చెవాలియర్ టి.థామస్ ఎలిజిబెత్ కాలేజ్ ఫర్ ఉమెన్, మేరీల్యాండ్, సెంబియన్, పెరంబూరు, చెన్నై, టి.ఎన్. - 600011.
- మహాలక్ష్మి టెక్ క్యాంపస్, నెం.1, భారతియార్ స్ట్రీట్, ప్రశాంతి నగర్, చెన్నై, టి.ఎన్ - 600044.
- ప్రిన్స్ డా. కె.వాసుదేవన్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, మాంబాక్కమ్, మేడవాక్కం మెయిన్ రోడ్డు, చెంగల్పట్టు డిస్ట్రిక్, చెన్నై, టి.ఎన్ - 600127.

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేథో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. పర్వత హారతి, చక్ర హారతి, కుంభ హారతి, మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వేదపండితులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకారంలో గురుదక్షిణామూర్తి